

# మౌనవీణ గానమిది

రెనిస్ ధనిశెట్టి

ఎర్త్ హైడ్స్ వరల్డ్ ఫర్‌గెట్స్... నిజమే భూమితల్లి వొడిలోకి వొరిగిపోతాను. నిశ్శబ్దంగా ప్రపంచం మరిచిపోతుంది... ఐడెంటిటీ క్రైసిస్. ఈ మిట్టమధ్యాహ్నం స్కూల్ రూమ్ అనబడే ఈ వరండాలోని నా అంతర్ముఖత్వం భరించరానిదనిపిస్తుంది ఒక్కోసారి.

అన్నం కూడా ఆల్కహాల్‌లాంటిదే, కడుపులో పడగానే మత్తు... మత్తులో నుంచి కన్పిస్తోన్న ప్రపంచం కౌగిట్లో ఎర్గోసమ్, సో... ఐ థింక్ దేర్‌ఫోర్ ఐయామ్... వొచ్చేస్తున్నారు పిల్లలు... పిల్లకాయలు. అసంకల్పిత ప్రతీకార చర్య బడిగంట ఠంగ్ టంగ్... టణా... పావ్‌లోవ్ కుక్కలు... ప్రాథమిక విద్యాపిల్లలు.

"సీజర్స్ వైఫ్ ఎప్పుడూ మస్ట్‌అబే ఆల్ ది సస్పిషన్స్." మనం అనుకొంటాం కానీ... మనకంటే పదుల సంవత్సరాలు ముందుంటారు పిల్లలు... ఒక్కోసారి టీచర్లనబడే మనం అలా ఆలోచిస్తూ బతుకు భయంలోకి జారుకుంటామా అప్పుడు ఆ కేర్‌ఫ్రీ మాటల్లో వీరవిహారం చేస్తారు పిల్లలు. పిల్ల టీచర్లు కేబుల్ టీవీ ముద్దుబిడ్డలు. చిరంజీవులూ, వెంకటేష్‌లూ, నాగార్జునలూ కాకుంటే సిమ్రాన్లూ, సౌందర్యలూ, రంభలూ. ఈలోగా ఒహడరుస్తాడు హైవార్డ్స్ ఫైవ్ థౌజండ్ ధమాకా అని. మరొహడు కిసాన్ అన్నపూర్ణ ఘరానా మొగుడంటాడు.

నిరోధానికి బెలూనుకూ తేడా తెలియని వయస్సు ఎంత అందంగా వుంటుందీ. వొక్కొక్కడొక్కడూ, వొక్కక్కతీ నెమ్మదిగా మెల్లగా దొంగల్లాగా వస్తున్నారు చేతుల్లో లాప్‌టాప్ పలకలతో, కూర్చుంటొన్నారు దొరల్లాగా... వాడు ఆ మూల రాజుగాడెప్పుడూ ఆ తెల్లటి పిల్ల పక్కనే కూర్చుంటాడు గువ్వలా వొదిగి... ఆ కెమికల్ కాంపౌండ్ రహస్యం తాలుకు రూట్ ఏవిటయ్యుంటుందబ్బా? మళ్లీ మత్తు... నిద్రకాని మెలకువ కాని అ-లౌకికం.

నిద్రపోతున్నాడని కనిపెట్టేసినట్టున్నారు మళ్లీ గొణ... గొణ మాటలు. సామూహిక శబ్ద తరంగాలు... సముద్రపు హోరులా... వుండుండీ వీచేగాలిలా చటుక్కున సైలెంటయిపోతారు, మళ్లీ మామూలే... రిథమిక్‌గా మాటల ప్రవాహం. అక్షరాలు రుద్దండ్రా గాడిదల్లారా... నేనో??... టీచర్ గాడిదనా? డిపెప్ రిజిస్టరు ఈ టేకు టేబిల్ సొరుగులో నిద్రపోతూంది... మత్తుగా... ఒహటే ఉక్క క్లమ్సీ వెదర్. ఎంతమందిని నిర్బంధించి విద్య నేర్పగలను? భగవాన్ ఈ దేశంలో విద్యా నిర్బంధమే. అపెప్, డిపెప్ వుత్త గాసిప్... బ్రిటిషోడి కుట్రగాదు గదా? వీథి బడిలో చదివిన వెధవలందరూ లంపెన్లుగానే తయారవుతారు. గాంధీగారి నా దేశంలో గడపకో గుమాస్తాగాడు. ఈ కసుగాయలు కర్మభూమి భావి పౌరులు చదివేంచేస్తారు... చదివేంచేస్తారు. బెన్నెట్ విల్స్మిత్ 'ఇండియన్ వే ఆఫ్ లైఫ్' ప్రకారం ఉద్యోగం చేస్తారు... ఆ తర్వాత పెళ్లి చేసుకుంటారు... పిల్లల్నికని ఆ తర్వాతర్వాత ఛస్తారు. ముందూ వెనకా... చదువో పెద్ద బర్త్ ట్రాజెడీ... చదువూ... స్కూలూ... జైలూ గురించి వుడీ అలెన్ను అడిగిచూస్తే సరి... జైలుకో మోడల్ స్కూలు. ఒరే మూడోతరగతి వెధవల్లారా ఎక్కాలి ఒప్పచెప్పాలి చదవండ్రా... లేకుంటే కర్ర విరుగుద్ది. అయ్యవారు చెబితే చదివే రోజులు పోయినయ్... దండం దశగుణం భవేత్... కర్రలు విరగాలి... లాఠీలు విరగాలి. అసలీ ప్రపంచంలో చదువనేదే లేకుంటే ఎంత బావుణ్నో... అమ్మో చదువే లేకుంటే నా ఉద్యోగం ఏవవు

తుందీ... పదహైదు వందల జీతంరాళ్లకు పదహైదు వందల సమస్యలు... జీవితమంతా ఒకానొక గాడిద ఆత్మవ్యథే... గోవిందరెడ్డికేం చెప్పాలి మూడు నెలల్నించి వాయిదా వేస్తున్న అప్పు, ఈ సాయంత్రం కొంప ముంచేట్టు వుంది. ఈ జనవరి ఫస్టున, ఎండీఓ గాడికీ, ఎంఈఓ గాడికీ ఏపిల్‌కాయలూ, గ్రీటింగులుకి ఓ తొంభై రూపాయలు ఎక్స్ట్రా కర్చు... గవర్నమెంట్లు కూలి, ఎలక్షన్లొస్తే బావుణ్ను. ఎంచక్కా నూటయాభై కొట్టెయ్యొచ్చు. పాడు జీవితమూ... ధనమూ... కనీసం ఆ నరసింహులు సార్‌లా చిట్స్ వేసినా లాక్కొచ్చెయ్యొచ్చు. చెత్త ముఖము నకు చిట్సు కూడా కరువాయెరా రామచెంద్రా...

బయట ఎండ దంచేస్తుంది. మూడున్నర... ఇంటర్‌వెల్ టయవయ్యింది. ఒరే నాయుడూ గంట కొట్రా... గంట మాట వినగానే రెడీ... అలర్ట్... కొట్టక ముందే పరార్ బయటకు. వరండా అంతా ఖాళీ... గంట మోగింది గణగణా... బయట, వోవో... అని అరుస్తూ పిల్లలు. చల్లటి నీళ్లతో మొహం కడుక్కుంటూంటే, ప్రాణం లేచొస్తుంది. కుర్చీలో కూలబడ్డాను. ఎదురుగా టేబుల్... కింద నేలమీద పుస్తకాలు, పలకలు. గజిబిజిగా నల్లని పలకలపై తెల్లని అక్షరాలు... నలుపుపై ఆధి పత్యం ఎప్పుడూ తెలుపుదే... మరి ఎరుపో... కలర్ బ్లైండ్ నెస్. ఎల్లుండి నుంచీ జన్మభూమి... ఎండల్లో జన్మభూమి... ఎండీఓ ప్రాణాలు తోడేస్తున్నాడు. జన్మభూమిని జయప్రదం చేయమని చెంద్రబాబు అక్కడపైన చెడుగుడాడేస్తున్నాడు... అవునుసుమీ చంద్రబాబుకు చదువు చెప్పిన టీచరెవ్వడు... కనీసం వర్కినస్పెక్టరయినా బావుండేది. శ్రమదానం వర్కుల్లో సగానికి సగం దిగమింగుండేవాడిని... గోవిందరెడ్డిని నోట్లకట్టల్తో కొట్టుండే వాణ్ని. పోయిన విడత జన్మభూమి మానవహారంలో ఎండదెబ్బకు ఇద్దరు పిల్లలు పడిపోయేరు కళ్లు తిరిగి... వాళ్ల నాయన్లు ఆడిన బూతు మాటలు ఇంకా చెవుల్లోకి గుర్తొస్తున్నాయి. పిల్లల్లేకుంటే ఎండీఓగాడి మొహం నయాపైసంతవృద్ధి... జన్మభూమి... పునర్జన్మ భూమి కొరియా నా కొడుకు గొంతు కోయాలి. భారతదేశ వేశ్య వరల్డ్ బ్యాంకు విటుడికి దాసోహం. ఒకే వొక్క జనరేషన్ బూజు మెదళ్లు నశించాలంటే ఎన్నివేల వీర్యవర్షాలు కురియాలో... నాయుడుగాడు చెక్కేసినట్టున్నాడు... నేనేకొడతాను గంట... టంగ్... టంగ్... టణా... వొస్తున్నారు లోపలికి... గొర్రెల్లాగా... రాశిలో తేడా...

ఒరేయ్ రెడ్డీ ఒంటేలు గంటకు ఇంటికెళ్లినోళ్ల పేర్లు రాయరా... రేపు చెబుతాను వెధవల పని... మండలాఫీసు నుంచి కబురొచ్చింది, రేపు పల్స్‌పోలియో ట్రైనింగు క్లాసురా... వొస్తానురా ఎండీఓ వొస్తాను... కృష్ణకుమారి... ద గ్రేట్ యంగ్ టీచరొస్తుందిగా వొస్తాను... బాటలు నడిచీ... పేడలు కడచీ... వొస్తాను.. కృష్ణకుమారి కాటుక్కళ్లు... కలహంస... ఏమిటి చెప్మా గుర్తు రావడం లేదు... భావదారిద్ర్యమా? బావా అని పిలుస్తే బావుణ్ను కృష్ణకుమారి నన్ను... లేడీగా పుట్టినా బావుండేది ఎన్ని లీవులో... ఈ మగగాడిదల్తో కనుసైగలతో పనులు చేయించుకొని ఉండేవాడిని... ట్రాన్స్‌వెస్టిజమా?.. వికారమా?... ఈసారి ఎలాగైనా కృష్ణకుమారితో మాట్లాడాలి... అక్కటా... కట... కటా... అక్కడ వాడుండును గదా, గిరిజాల జుట్టు గీరగొంతు మోహన్రావు... వాడు వేసే కుళ్లు బూతు జోకులకు అలా నవ్వుతుందే అది పడీ పడీ... వాడో పెద్ద మేల్ ఫెమినిస్టు. కడుపు మండుతోంది... డెందమును దహియించు ఈర్ష్యాసూయలు వులు... జీవా... కృష్ణకుమారి నడుం వొంపులో సమస్త సౌందర్యం రహస్యం దాగుంది... కాదా? దాన్ని పెళ్లి చేస్కొంటే బావుణ్ను... ముప్పై ఆరేళ్ల బ్రహ్మచర్యం ఫట్... రెండు జీతాలు... ఐదుమంది గోవిందరెడ్లను చుట్టూ తిప్పుకోవచ్చు...

మళ్లీ శబ్దం... గొణ... గొణ... ధ్వని... సూపర్ సానిక్ సౌండ్‌ను మించుతూ... ఆత్మకథలు చూశావా? అన్వేషిత చూశావా? కళంకిత బోరు... నాల్గో తరగతి అమ్మాయిల కబుర్లు. ఎయిడ్స్... ఎక్వయిర్డ్ ఇంటెలిజెన్సీ డెఫిషియన్సీ సిండ్రోమ్... వాక్సినేషన్ ఒహటే... కేబుల్ టీవీని కట్ చేయడమే... చెట్టు మీద సుక్కగువ్వ అదేపనిగా అరుస్తోంది... అది ఏవంటోంది గోవిందరెడ్డి వొస్తున్నాడనా?... అతడు అడవిని జయించాడు... లేదా అని చేతిలో అడవి వోడిపోయింది. ఒక్క కేశవరెడ్డికీ ఒక్క హెమ్మింగ్వేకే తెలుసా లింగ్విస్టిక్ డైలమా జిగ్సాపజిల్... అయితే బతుకు రహస్యం మరో వడ్డెర నరసింహాచారికి తెలుసు కానీ చెప్పడు... సివిల్ సర్వీసు బుడగ కాస్తా పగిలి గిలీ... ఎలిమెంటరీ స్కూలు టీచరయ్యింది. ఈ రోజు గోవిందరెడ్డిగ్గాని కన్పిస్తే నా పని గోవిందా... ఒరే గంగాధరం ఎక్కాలు చెప్పరా నాయనా... రెండొకట్ల రెండు... రెండ్రెళ్ల నాలుగు. రెండ్మూళ్ల నాల్గు... కార్టీజియన్ సిస్టమ్... రెకార్టీజియన్ ఫ్రేమ్... విశ్వసత్యం కానీ గోవిందరెడ్డికి మాత్రం రెండువందలూ ఇంటూ రెండు ఈజీక్వల్‌టు పధ్నాలుగు వొందలు... చక్రవొడ్డీ మహిమ. నిత్యావసర వస్తువుల్లో మొదట చేర్చాల్సింది డబ్బు.

మరా అడమ్‌స్మిత్తూ... శ్రమదానం చేసైనా సరే వాడి బాకీ తీర్చేయ్యాలి... కోట్ల డాలర్లుంటే బావుణ్ను. విల్మట్‌ను పట్టి ఇన్‌స్టాంట్‌గా రంభనో... మాధురీదీక్షిత్‌నో, బోడెరిక్‌నో, శాండ్రబుల్లక్‌నో క్లోనింగ్ చేసుకోవచ్చు... కృష్ణ కుమారినే క్లోనింగ్ చేస్తే సరి. సెక్స్ విత్ క్లోనింగ్... అప్పుడిహ విరహబాధలూ లేవూ. వెరయిటీ జీవితమూ లేదు... నిజమూ లేదు... ఫెమినిజమూ లేదు... పద్దెనిమిది రెండ్ల ముప్ఫై ఆరు... మారేజీ లైఫ్ కొన్నాళ్లు గడిచాక... చిరిగి పేలికలయ్యాక భంగిమ ముప్ఫై ఆరే గతి. ప్రమోషన్ మీద జూనియర్ లెక్చరర్ కావాలంటే ఎట్‌లీస్టు మరో మూడు జన్మలెత్తాల్సి వుంటుంది. ద్రోణాచార్యుడి కిచ్చేందుకు వేళ్లు కూడా మిగల్లేదు... లాటరీ ఎంట్రెన్స్ టెస్టు ల్రాసి రాసీ అవి కూడా అరిగిపోయాయి. ఎండాకాలం శలవులు తప్ప ఏం మిగిలాయి జీవితానికి. ఉద్యోగం ఒక జీవితకాలం కారాగారం. వేయి నాల్కల కల్కి భగవాన్. శాటిలైట్ భావప్రాప్తి నుంచి నా వారసులను రక్షించు తండ్రీ... ఆమెన్... ఎక్కాలు ఆపండ్రా చెక్క మొహాల్లారా... గవర్నమెంటు సమయం నాలుగయ్యింది. జనగణమన పాడండ్రోయ్. జనగణమన అధినాయక జయహే... స్కూలు నుంచి స్వేచ్ఛ కోసం ఎనభై కంఠాలు చేస్తున్న స్వేచ్ఛాగీత దీనాలాపన... భారతదేశ సమస్త ప్రజల మనస్సులకు నాయకుడవైన ఓ విధాతా, భారతదేశ భాగ్య సంపదలకు నీవే కర్తవు. ఐఎమ్మెఫ్, వరల్డ్ బ్యాంకు సిరులు పొంగే జీవగడ్డ నాది... ఖలిస్తాన్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, ఉత్కళ, ఉల్ఫా, జైతెలంగాణా, ద్రవిడస్తాన్, కాలుష్య యమునా గంగా జయహే, జయ, జయ, జయ, జయహే... స్కూల్ డిస్పర్స్ జై హింద్... గోవింద్...

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 22 నవంబరు, 1998*

